క్లుప్తంగా

డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా కిషన్‌సింగ్



కల్హేర్(నారాయణఖేడ్): మూడ్ కిషన్‌సింగ్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం బల్కంచెల్క తండాకు చెందిన కిషన్‌సింగ్ ఇప్పటివరకు మెద్చల్ జిల్లా రవాణాశాఖ అధికారిగా పనిచేశారు. హాస్టల్‌లో ఉండి ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. ఉన్నత చదువులు చదివి రవాణాశాఖలో ఎంఈఐగా ఉద్యోగం పొందారు. రాష్ట్రస్థాయిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ తండాలోని యువకులను ప్రోత్సహించడంతో పలువురు ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడ్డారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతూ గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్ చూపిన బాటలో నడుపుతున్నారు. పుట్టిన గడ్డ బల్కంచెల్క తండాను ఆదర్శంగా తీర్చారు.

అంబులెన్స్‌ను కేటాయించండి



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సంగారెడ్డి: నారాయణఖేడ్‌కు అంబులెన్స్ కేటాయించాలని బీజేపీ నాయకులు అరుణ్‌రాజ్ శనివారం జిల్లా వైద్యాధికారి గాయత్రీ దేవిని కోరారు. ఖేడ్‌లో ప్రస్తుతం నడుస్తున్న 108 అంబులెన్స్ 3లక్షల 49వేల కిలోమీటర్లు తిరిగిందని, దానిని మార్చాలని వినతిపత్రం అందజేశారు. అత్యవసర సమయంలో రోగులు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

317 జీఓ సమస్యలను పరిష్కరించాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): 317జీఓ వల్ల తీవ్ర అన్యాయం జరిగిందని, తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ జీఓ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి శివరాజ్ ఓ ప్రకటనలో కోరారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన 317 జీఓ వల్ల అనేక మంది స్థానిక ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని వాపోయారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 317జీఓ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న ఇప్పటి వరకు దాని ఊసే ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణంలో సింధు ఆదర్శ్‌రెడ్డి దంపతులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీకాలనీలో లోకకల్యాణార్థం అర్చకులు వామనభట్ల ప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో శనివారం లక్ష్మీనారాయణ కల్యాణ మహోత్సవం, శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు తమ ప్రాంతంలో జరగనున్న పూజ కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆదివారం ఉదయం సామూహిక సత్యనారాయణ వ్రతం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున్న పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సకాలంలో రోడ్డు పనులు పూర్తి చేయాలి

కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్



రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్

పటాన్‌చెరు టౌన్: సకాలంలో సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలో కార్పొరేటర్ పర్యటించి, పాత మార్కెట్ నుంచి గౌతంనగర్ వరకు నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం శాంతినగర్‌కాలనీలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం జరగనున్న మహా అన్నదాన కార్యక్రమం నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రం చేయించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.

నిరీక్షణ ఇంకెన్నాళ్లు..?

- రెండేళ్లుగా పింఛన్ కోసం ఎదురుచూపులు
- కొత్త పింఛన్ల ఊసెత్తని ప్రభుత్వం



సంగారెడ్డి ఎడ్యుకేషన్: వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు ప్రభుత్వాలు పింఛన్లు మంజూరు అందజేసేది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండేళ్లుగా నూతన పింఛన్‌లను మంజూరు చేయలేదు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కొత్త పింఛన్లు వస్తాయనే ఆశతో ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు నిరాశ తప్పడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా పింఛన్ల ప్రకటన చేయకపోవడంతో లబ్ధిదారులకు ఇంకా ఎన్నాళ్లు ఎదురుచూడాలోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 1,57,513 పింఛన్‌లు

జిల్లా వ్యాప్తంగా 1,57,513 పింఛన్‌లు ఉన్నాయి. వీటిలో వృద్ధాప్య 59,978, వికలాంగులు 14,611, వితంతువు 71,234, నేత కార్మికులు 696, గీత కార్మికులు 819, ఒంటరి మహిళలు 7,501, బీడీ కార్మికులు 112, ఆర్ట్ 2037, ఫైలేరియా 386, డయాలసిస్ 139 మంది లబ్ధిదారులకు గానూ నెలకు రూ 36,18,65,728 అందజేస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ముందు నెలకు రూ 200 ఉన్న పింఛన్ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటిసారి అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ రూ.1000, రెండవ సారి అధికారంలోకి వచ్చిన తరువాత మరో వెయ్యి కలిపి నెలకు రూ 2 వేలు ఇచ్చేది. దివ్యాంగులకు మాత్రం నెలకు రూ 3 వేలు ఇచ్చేది, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత నెలకు రూ.4 వేలు ఇస్తామని ప్రకటించింది. నేటికీ ఒక్క కొత్త పింఛన్ లేదు.. పెంచడం జరగలేదు.

పెంపుపై ఆశలు

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వృద్ధులకు రూ.4000 వేలు పింఛన్ పెంచుతామని హామీ ఇచ్చింది. అధికారం చేపట్టి సంవత్సర కాలం గడుస్తున్నా.. పింఛన్ పెంచకపోవడంతో లబ్ధిదారులకు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఒకసారి మాత్రమే 57 సంవత్సరాలు నిండిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది.దరఖాస్తులు స్వీకరించడమే తప్ప పింఛన్ మంజూరు చేయలేదు. దీంతో చాలా మంది లబ్ధిదారులు నూతన పింఛన్లు మంజూరు, పింఛన్‌ను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

పింఛన్ రావడం లేదు



16 నెలల క్రితం మా భర్త చనిపోయాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాను. ఇప్పటివరకు వరకు వితంతువు పింఛన్ రావడం లేదు. గతంలో చాలా సార్లు పంచాయతీ కార్యదర్శికి, మండల పరిషత్ కార్యాలయంలో కూడా మరణధ్రువీకరణ పత్రంతో పాటు అన్ని పేపర్లు ఇచ్చాను. అయిన కానీ రావడం లేదు. దయ చేసి అధికారులు స్పందించి పింఛన్ ఇప్పించగలరు.

–ఫాతిమా, మారేపల్లి

ఎటువంటి ఆదేశాలు రాలేదు



పింఛన్ల పెంపుపై ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం. సుమారు ఒక సంవత్సరం నుంచి నూతన పింఛన్‌లు కూడా ఏది రావడం లేదు. త్వరలో ప్రభుత్వం పింఛన్‌ల పెంపు, కొత్త పింఛన్‌లను అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. త్వరలో పెంచే ఆస్కారం ఉన్నట్లు తెలుస్తుంది.

–జ్యోతి, డీఆర్‌డీఓ పీడీ

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతులకు మేలు

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



జెండా ఊపి బస్సులను సాగనంపుతున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: రైతుల మేలు కోసం పనిచేసేది ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్‌లో శనివారం జరిగిన రైతుపండగ సభకు డివిజన్ పరిధిలోని రైతులు బస్సుల్లో తరలివెళ్లగా ఎమ్మెల్యే జెండా ఊపి బస్సులను సాగనంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ జరుగుతుందన్నారు. వివిధ కారణాలతో నియోజకవర్గంలోని 2012 మంది రైతులకు నిలిచిన రూ.18.32 కోట్ల రుణమాఫీ నిధులను సీఎం చేతులమీదుగా సభలో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. వ్యవసాయశాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అలాగే, పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరారు.

ఎమ్మార్పీఎస్ నిర్మాణానికి చర్యలు



అలిగేజీవన్‌కు సంఘం కండువా కప్పుతున్న గీత

నారాయణఖేడ్: నియోజకవర్గంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పూర్తిస్థాయి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని బుచ్చేంద్ర మాదిగ పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గ సంఘం కన్వీనర్‌గా న్యాయవాది అలిగేజీవన్‌ను ఎమ్మార్పీఎస్‌తో పాటు అనుబంధ సంఘాలైన ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ, ఎంఎంఎస్ రాష్ట్ర నాయకురాలు గీత, జిల్లా అధ్యక్షురాలు పల్లవి మహాజన్, ఎంజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం కండువాను కప్పి అభినందించారు. ఈ సందర్భంగా అలిగేజీవన్ మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఆయా సంఘాల నాయకులు వీరయ్య, అమృత్, మాణిక్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీఓ

రాయికోడ్(అందోల్): వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యభద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్ ఆదేశించారు. రాయికోడ్‌లోని ఎస్సీ, బీసీ వసతి గృహాలు, కేజీబీవీ వసతి గృహాన్ని ఎంపీడీఓ షరీఫ్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధిగా మెనూ పాటించాలని సూచించారు. ఆయా వసతి గృహాల్లో సమస్యలను తెలుసుకున్నారు. వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. తాజా కూరగాయలు వినియోగించి వంట చేయడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్సీ వసతి గృహంలో ఆహార సామగ్రిపై మూతలేకపోవడం, మెనూ పాటించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆయా వసతి గృహాల్లో రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు.

కస్తూర్బాలో ఆకస్మిక తనిఖీ

నారాయణఖేడ్: ఖేడ్‌లోని జూకల్ శివారులో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, నాగల్‌గిద్ద కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం ఆర్డీఓ అశోక చక్రవర్తి స్థానిక తహసీల్దార్ భాస్కర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, స్టోర్ గది, వంట సరుకులు, వండిన వంటలను పరిశీలించారు. విద్యార్థినుల సమస్యలు, భోజనం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

డ్రగ్స్‌పై అవగాహన



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని గీతాభూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ టీం సభ్యులు డీఎస్పీలు సుబ్బరాయుడు, హరిచంద్రరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలను వారు విద్యార్థులకు వివరించారు. ఎవరైనా డ్రగ్స్ వాడమని ప్రేరేపిస్తే వెంటనే 1908 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని చెప్పారు. విద్యార్థులకు మంచిగా చదువుకొని జీవితంలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, గోపి, ఎస్‌ఐ శశికాంత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరుకుపంట దగ్ధం



కాలిపోయిన చెరుకు పంట

ఝరాసంగం(జహీరాబాద్): ప్రమాదవశాత్తు చెరుకు పంట దగ్ధమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని బర్దిపూర్ గ్రామ శివారులోని కోట హేమలత ఎకరా చెరుకు తోట సాగు చేసింది. శనివారం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని పంట మొత్తం కాలిపోయింది. చెరుకు తోటతో పాటు డ్రిప్పు పరికరాలు సైతం కాలిపోయాయి. సుమారుగా రూ. 2 లక్షల పంట నష్టం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. చేతికొచ్చిన పంట నష్టపోవడంతో రైతు హేమలత కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం అందుకున్న జహీరాబాద్ అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసిన ఫలితం దక్కలేదు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

రహదారుల అభివృద్ధికి కృషి



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి కృషి చేస్తోందని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ అన్నారు. శనివారం మండలంలోని ప్యారవరం గ్రామ శివారులో సీఆర్‌ఆర్ నిధులు రూ.3కోట్ల వ్యయంతో నిర్మించే హైలెవల్ బ్రిడ్జి పనులకు ఎమ్మెల్యే మాణిక్‌రావు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గత 10 సంవత్సరం కాలంలో రహదారులు పూర్తిగా అధ్వానంగా మారాయన్నారు. ధ్వంసమైన రోడ్లను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసి, నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు అమలు చేస్తామన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కుటుంబ సర్వే చేపట్టిందన్నారు. నిమ్జ్‌కు అనుసంధానం అయ్యే రహదారులకు జాతీయ గుర్తింపునకు కృషి చేస్తామన్నారు. ఈ విషయమై కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. బీదర్, జహీరాబాద్, తాండూర్ రహదారిని జాతీయ రహదారి కోసం కృషి చేస్తామన్నారు. సంగారెడ్డి–జహీరాబాద్, చిరాగ్ పల్లి వరకు ఉన్న రోడ్డును ఎక్స్‌ప్రెస్‌వేగా మార్చటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవదాసు, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు రుద్రప్పపాటిల్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు శంకర్‌పాటిల్, నాయకులు తన్వీర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ రాజ్ డీఈకి సన్మానం



సన్మానిస్తున్న గిరిజన నాయకులు

సంగారెడ్డి: పంచాయతీరాజ్ శాఖలో డీఈగా విధులు నిర్వహించి శనివారం పదవీ విరమణ పొందిన రామయంపేట పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీర్ ఈశ్వర్‌నాయక్‌కు గిరిజన సంక్షేమ సంఘం సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ఘనంగా పూలమాలలు, శాలువాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ మాట్లాడుతూ.. ఉద్యోగులు విధి నిర్వహణలో అందించిన ఉత్తమ సేవలతోనే గుర్తింపు లభిస్తుందన్నారు. ఉద్యోగరీత్యా పదవి విరమణ సహజమన్నారు. సుమారు 38 సంవత్సరాలుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన ఈశ్వర్‌నాయక్ వారి భావి జీవితాన్ని ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ నాయక్, ప్రధాన కార్యదర్శి ఫూల్ సింగ్, నాయక్ మాజీ ఎంపీటీసీ కోలా సుదర్శన్ , సుభాష్ నాయక్, మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్‌నాయక్ ,సుధీర్ రాథోడ్ కిరణ్ నాయక్ ఆకేష్‌లు పాల్గొన్నారు.

ముగిసిన జీవన్ముక్త మహరాజ్ ఉత్సవాలు



ప్రసాదం పంపిణీ చేస్తున్న జ్ఞానేశ్వర్ మహరాజ్

మునిపల్లి(అందోల్): జీవన్ముక్త మహరాజ్ ఉత్సవాలు శనివారం ముగిశాయి. మండలంలోని అంతారం జీవన్ముక్త మహరాజ్, పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తుల ఉత్సవాలు ఐదు రోజులు కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా దేవతామూర్తులు, గురుమూర్తులను దర్శించుకోవడానికి నిజాంబాద్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, హైదరాబాద్, కర్నాటక, మహారాష్ట్రతో పాటు సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలోని ఆయా గ్రామాల భక్తులు హాజరై దేవతామూర్తులను దర్శించుకున్నారు. అంతేకాకుండా మాజీ ఎంపీపీ రాంరెడ్డి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులతో పాటు జీవన్ముక్త మహరాజ్, గురుమూర్తులను దర్శించుకున్నారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహరాజ్ తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

బంద్ విజయవంతం

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని శనివారం జిల్లా వ్యాప్తంగా చేసిన బంద్ విజయవంతం అయింది..ఈ సందర్భంగా పలు విద్యార్థి సంఘాలు పాల్గొని ప్రభుత్వ పాఠశాలలను బంద్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.



సంగారెడ్డి ఎడ్యుకేషన్: కలెక్టర్ క్రాంతికి వినతి పత్రం అందజేస్తున్న యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



బంద్ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



జోగిపేట: తరగతులు బహిష్కరించిన నేతలు



సదాశివపేట: మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అనిల్



నారాయణఖేడ్ విద్యాసంస్థల బంద్ పాటిస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం చిట్కుల్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఉ.10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఇస్నాపూర్ ఏఈ వీరాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో చిట్కుల్ గ్రామం పరిధిలోని నాగార్జున కాలనీ, సనా ఎస్టేట్, సాయి ప్రియకాలనీ, విజేత కాలనీ, రామ్ రాజ్ నగర్, ముత్తంగిలో విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని చెప్పారు. అదేవిధంగా మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చిట్కుల్ గ్రామంతో పాటు వడ్డెర కాలనీ, సాయి సంతోష్ టౌన్‌షిప్, ఆంధ్ర కాలనీల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని, వినియోగదారుల సహకరించాలని ఏఈ కోరారు.

◆ పరిశ్రమలకు జరిమానాలు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని లీ ఫార్మా పరిశ్రమ, గ్రాన్యువల్స్ పరిశ్రమలకు పీసీబీ అధికారులు జరిమానా విధించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్నారంటూ గతంలో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపారు. శనివారం పీసీబీ రాష్ట్ర మెంబర్ రవి రెండు పరిశ్రమలకు కలిపి రూ.16 లక్షల జరిమానా, రూ.48 లక్షల బ్యాంకు గ్యారంటీలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పర్యావరణానికి ప్రజల జీవన విధానానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న పరిశ్రమలపై కఠినంగా వ్యవహరిస్తామని పీసీబీ అధికారులు హెచ్చరించారు. మరోమారు ఇటువంటి చర్యలకు పాల్పడకుండా ఉండాలని తీవ్రంగా హెచ్చరించారు.

◆ కాలనీలో పడిపూజలు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీలో అయ్యప్ప పడిపూజ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం కావేరి హోమ్స్‌లో తుమ్మల వెంకటేశ్వర్‌రెడ్డి, ఇక్రిసెట్ కాలనీ ఫేస్2లో సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి మహాపడిపూజ భక్తులను ఆకట్టుకున్నాయి. పూజల్లో అమీన్‌పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహగౌడ్, కౌన్సిలర్లు ఏనుగు కవిత శ్రీనివాస్‌రెడ్డి, నవనీత జగదీష్ పాల్గొన్నారు.

◆ సామూహిక వ్రతాలు

జిన్నారం (పటాన్‌చెరు): మండల కేంద్రంలోని రంగరాముల గుట్టపై శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన 20 జంటలు సత్యనారాయణ స్వామి గణపతి పూజలు చేశారు. పూజా క్రతువులు రామాలయ అర్చకుడు లక్ష్మణాచార్యులు వేదమంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రంగరాముల స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

◆ ఘనంగా కార్తీక దీపోత్సవం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పద్మశాలి భవనంలో శనివారం రాత్రి కార్తీక మాస దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డ జనార్దన్ ఆధ్వర్యంలో మహిళలు, పిల్లలు, పురుషులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించారు. అంతకుముందు మార్కెండేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. మారేడు ఆకులతో అర్చన చేసి దీపాలను వెలిగించారు.

◆ ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రంలో ఘనంగా అయ్యప్పస్వామి మహా పడిపూజను నిర్వహించారు. నింబోజు శ్రీకాంత్‌చారి స్వగృహంలో శనివారం మహా పడిపూజ ఏర్పాటు చేశారు. కిట్టు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి అభిషేకాలు 18 మెట్ల పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ అయ్యప్ప భజన మండలి వడ్ల నాగేష్ బృందం పాటలు అలరించాయి. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ సూర్యనారాయణ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

◆ పెండింగ్ డీఏలను ప్రకటించాలి

జహీరాబాద్: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జహీరాబాద్‌లో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు శ్యామ్, సువర్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జీఓ 317 బాధితులకు న్యాయం చేసే విషయంలో ఎటూ తేల్చకుండా తాత్సారం చేస్తున్నదని విమర్శించారు. స్థానికతకు ప్రాధాన్యతనిచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఇటీవల కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఐదు వాయిదాల డీఏ చెల్లింపులో కేవలం ఒక వాయిదాను మాత్రమే చెల్లించడం సమంజసం కాదన్నారు. కనీసం మూడు వాయిదాల డీఏ ఇవ్వడానికి ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, విద్యారంగ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.ముకుంద్, జగన్మోహన్, విజయ్‌కుమార్, సిరాజుద్దీన్, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

◆ 6వ వార్డులో నేతల పర్యటన

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని 6వ వార్డులో శనివారం ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షుడు మొహిద్ పటేల్, మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్, వార్డు అధికారులు పండరి, నయీమ్, వినయ్‌లతో కలిసి పర్యటించారు. మురుగుకాల్వలు, విద్యుత్తు స్తంభాలు లేకపోవడం తదితర సమస్యలను ప్రజలు వారి దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వార్డు వాసులకు హామీనిచ్చారు. వారివెంట పార్టీ ప్రధాన కార్యదర్శి మజర్, అహ్మద్ పటేల్ ఉన్నారు.

◆ విజయోత్సవాలపై కళాజాత

నారాయణఖేడ్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తికావస్తున్న నేపథ్యంలో ప్రజాపాలన– విజయోత్సవాల్లో భాగంగా శనివారం ఖేడ్ మండలం అంత్వార్, రుద్రారం గ్రామాల్లోని ప్రధాన చౌరస్తాల్లో కళాకారులు ప్రదర్శనలిచ్చారు. ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పాటల, ప్రదర్శనల రూపంలో వివరించారు.

◆ సేవలతోనే గుర్తింపు

రాయికోడ్(అందోల్): ప్రభుత్వ ఉద్యోగులు చేసిన సేవలే ప్రజల్లో గుర్తిండిపోతాయని మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్ అన్నారు. రాయికోడ్‌లోని ఐకేపీ భవనంలో ఆర్ఐ ప్రభాకర్‌కు పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ శాఖలో 16 ఏళ్లుగా ప్రభాకర్ నిబద్ధతతో విధులు నిర్వహించారన్నారు. వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రభాకర్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్, డీటీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.